# పసుపు కుంకుమ

పసుపు కుంకుమలతో శుభలేఖ వచ్చేసరికి ఆనందంతో అందు కున్నాను...కానీ...

మా మేనమామకు వివాహం అని చదివి వెంటనే కృంగిపోయాను! ఎందుకంటే——

క్రిందటి ఏడాది ఈ పాటికింకా సుభద్ర నలుగురు పిల్లలతో నట్టింట తిరుగుతూ వుండేది అనుకుంటాను!

ఆవిడ నాలుగోకాన్పుకి కనుమూసింది. సంసారం దిద్దుకోటంలో నలుతేనేం, బంధు మర్యాదలో నయితేనేం చిన్నదయినా నోట్లో నాలుక లావుండేది. ఎంతో మంచిది. కలుపుకోరు మనిషి. మా అందరి కళ్ళలోనూ యింకా ఆమె మంచి తనం, అందం, మెదులుతూనే వున్నాయి. ఎంత మరుద్దామన్నా మరువలేము. అంతలా బంధువు లందరిమీదా ఆమె ముద్ర వేసుకున్నది.

అట్లాంటిది మా మేనమామ ఎంతలో మరిచిపోయి ఈ రెండో పెళ్ళి చేసుకోగలుగుతున్నాడా? అని ఆశ్చర్యం, చెప్పలేనంత కోపం కూడా కలిగేయి...

ఆ శుభలేఖ చూస్తున్నంతసేపూ మా సుభద్ర పోయిన రోజు జరిగిన సంఘటనలే గుర్తుకు రాసాగేయి...

ఆరోజు టెలిగ్రాం అందగానే...బయలుదేరి వెళ్ళాం...ఏమిటో, అతృత, ఆవేదన, హృదయాన్ని బరువుగాచేసి వదిలాయి. ఇల్లు దగ్గిరవు తున్న కొద్దీ...గుండె దడ...

మెల్లెక్కుతూ వుంటే కాళ్ళాడలేదు...వణకజొచ్చాయి...ఇవతలేం గొడవలేదు. ఎలా వుందో ఏమిటో...అనుకుంటూ లోపలికి వెళ్ళాం.

ఇల్లంతా బావురు మంటూంది...

అంతా నిశ్శబ్ధంగా వుంది...

ఎప్పుడయినా యిలా వస్తే కిలకిల లాడుతూ ఎక్కడో వంటింట్లో వున్న మా అత్త వసుగు వసుగున నవ్వుతూ వచ్చి పలకరించేది!

ఏదీ?...యిప్పుడేదీ?...

ఇల్లంతా నిద్రపోతున్నట్టు వుంది.

ఏవో చీకటి నీడలు అలుముకున్నట్టున్నాయి.

లోపల వరండాలోకి వెళ్ళనే వెళ్ళా...

సుభద్ర...!

క్రిందపడుకొని వుంది చుట్టూ ఎవళ్ళెవళ్ళో మూగి వున్నారు. అయిపోయింది!...అంతా అయిపోయింది.

మా(వయ్య మమ్మల్ని చూసి చిన్న పిల్లాడిలా ఏడ్చాడు. సుభద్ర మీద పడి ఏడుస్తూ వుండిపోయాడు.

భర్తను ఎంత ప్రేమించినా, నలుగురిలోనూ, ఎవరేమనుకుంటారో అని...ఎంతో దూరంగా, మామూలుగా సర్వసంగ పరిత్యాగిలా వుండేది. అలాటిది మామయ్యే మీద పడి ఏడుస్తూంటే ఎలా సహించి, తనను కాదన్నట్లు వుందో...అనిపించింది.

ఆ మొహం చూస్తే నిద్రలో వున్నట్లు వుంది! ఏమీ వాడిపోలేదు. అసలు ఆమె చనిపోయిందని ఎవరన్నారు!...లెండి...చూద్దాం! మీకు మతిపోయినట్టుంది! అనుకుని మాకు నమ్మకంలేక దగ్గరికిపోయి చూశాం. కానీ ఇంకెక్కడి సుభద్ర! మేమే పొరబడ్డాం! ఆమె యింత పిసరూ ప్రాణం పోయినట్టు లేకపోయినా, ప్రాణం మాత్రం ఆమెను విడిచి పోయింది. అదేం చిత్రమోగాని ఆ ముఖమూ, చేతులూ, కాళ్ళలోనూ ఆ

మృదుత్వం, ఆ రంగు, ఏమీ పోలేదు! నమ్మడమా? నమ్మకపోవడమా! అలా మేం నిశ్చేష్టులమయి నిలబడిపోయాం.

మా మేన మామ చెప్పడం మొదలెట్టేడు...ఆమె ఎలా పోయిందో ఏమిటో!

అంతవరకూ ఆ ప్రక్క గదిలోవున్న పిల్లాడి సంగతి ఎవరికీ అక్కర్లేకపోయింది! వాడు కెవ్వుమనగానే ఒకామె అటువెళ్ళింది. అయిష్టతతో అందరి ముఖాలూ ముడుచుకొని వున్నాయి. ఆ కుర్రవాడు పుట్టి సుభద్రను మింగేశాడని—

జీవితంలో మరి చవి చూడలేని మాతృప్రేమనే కోల్పోయిన ఆ నిర్భాగ్యుడు, ఏమీ ఎరుగనిని ఆ పసివాడు ఏడ్చిఏడ్చి పాలివ్వగానే వూరుకున్నాడు!

అంతవరకూ ఆ ఇంటికి సర్వాధికారిణి, గృహిణి అయిన సుభద్రని— ఆ ఇంట్లో ఇంకావుంటే మరి భరించలేనట్టు, కొంతసేపటికి సన్నాహాలు చేస్తున్నారు!

దగ్గర మొగవాళ్ళు కొందరు ఆ సదుపాయాలు చేసిపెడుతున్నారు. ప్రొద్దెక్కుతున్నకొద్దీ ఎంత ఆలస్యమవుతూవుంటే అంత బరువయిపోతూంది. అందరికీ సుభద్ర, ఒకనాడు అందరికీ అతిప్రియమైన సుభద్ర.

"అప్పుడే పదకొండు అయింది. ఇంకా ఎవరూ రాలేదేం?" అని కొందరూ.

"ఎవరో ఒకరు పరుగెట్టి వేగిరం పిలిపించుకురండి. ఇంకా బోలెడు తంతు వుంది." అని కొందరూ—

ఇలా తొందర పడజొచ్చేరు. సుభద్రను సాగనంపేందుకు.

పెద్ద కొడుకు పదహారేళ్ళవాడు ఉపనయనం అయింది; రెండోవాడు ఇంకా చిన్నవాడు; మూడోది ఆడపిల్ల ... బిక్కచచ్చిపోయి— ఏడుస్తూ ఓ మూల కూర్చుండిపోయింది!

పెద్దవాడు దూరంగా నిలబడి దుఃఖిస్తున్నాడు. రెండోవాడు అప్పుడప్పుడూ అందరూ ఏడవడం చూస్తూ ఎవరో జ్ఞాపకం చేసినట్టు తల్లి

వైపు చూస్తూ బావురుమంటున్నాడు. పిళ్ళందర్నీ ఎవళ్ళో ఒకళ్ళు ఓదారుస్తున్నారు.

ఇన్ని జరుగుతున్నా తనకు కాదన్నట్టు నిద్రపోతూందా అనిపిస్తూంది! ప్రాణంపోయినా ప్రేతాత్మ ఆ పన్నెండు రోజులూ అక్కడే వుంటుందంటారు. అదే నిజమైతే మీదనుండి తనకోసం ఏడుస్తున్న వారందరినీ చూస్తూ ఏమీ చేయలేక ఏమనుకుంటూవుంటూందో?

ఎక్కడ ఏ పని జరుగుతోన్నా, గాలి, వెలుతురూ, భూమీ, ఆకాశమూ, నీరు ఇవి సాక్షిగా వుంటాయిగాని ఏమైనా అనగలవా? చెప్పగలవా?– అలాగే పంచభూతాల్లోనూ ఏకమైన ఆమె ఆత్మ మాత్రం ఏం చెప్పగలదు?

బ్రాహ్మణులు వచ్చారు... వెదురు కర్రలూ, పిడకలూ, కుండ, అవీ తెచ్చి కొందరు వీధి గుమ్మంలో సిద్ధంగా వుంచేరు ... ఒక్కసారి అందరూ ఘొల్లుమన్నారు.

మరికొందరు– ఏంచేస్తాం? ఎంతఏడ్చినా మన సుభద్ర రాదుకదా? తిరిగి. అయిందేదో అయింది. ఇకముందు పని కానీయండి ... వెళ్ళి స్నానాలు చేయండి! పెద్దవాడిని తీసుకువెళ్ళి స్నానంచేయించి, పని కానివ్వండి... అని హెచ్చరించారు.

చెప్పినదంతా ఆ పసివాడే చేస్తున్నాడు.

మా మేనమామ–ప్రతిమలా అలా నుంచున్నాడు చూస్తూ. ఒకటి రెండుసార్లు ఏదో తను సుభద్రను తాకి చెయ్యబోతే...

"కొడుకు లేకపోతే తమకు తప్పదుగాని... కుమారుడు, అందులోనూ ఉపనయనం అయినవాడూ వుండగా ఇహ మీ పని ఏమీలేదు. మీరలా చూస్తూ కూర్చోవడమే... అంత హక్కూ యీ కుర్రాడిదే!... ఆమెకేం. హాయిగా పుణ్యస్త్రీగా వెళ్ళిపోయింది! కొడుకు కర్మ చేస్తూంటే సద్గతులు పొందబోతూవున్నది!" అని అన్నారు బ్రాహ్మణులు.

మామయ్య కళ్ళవెంట బొట బొట నీళ్ళు కారడం చూశాము. బహుశా ఇన్నాళ్ళు కాపురంచేసి... ఇప్పుడు చేయి వేయడానికి కూడా హక్కు లేదా? తను పనికిరాడా? తనుచేస్తే ఆమెకు సద్గతులు రావా? కొడుకు పుట్టినంత మాత్రంతో సంబంధం మరి లేదా? తన ప్రసక్తి లేదా?... అంతా చూస్తూ, ఒక ప్రేక్షకుడిలా చూస్తూ కూర్చుండవలసిందేనా? యీ ఏడుపేనా ఆఖరికి మిగిలింది?" అని అనుకున్నాడేమో!

పీటలమీద సుభద్రని పడుకోపెట్టేరు. స్నానం చేయించారు. ఎడతెరిపి లేకుండా, మంత్రోచ్చారణ జరుగుతోవుంది, సుభద్ర ముఖానికీ, చేతులూ, కాళ్ళకీ పసుపు రాశారు. బొట్టుపెట్టారు... కొత్త చీర కప్పేరు.

ఎలావుంది సుభద్ర అప్పుడు?

అప్పుడే పచ్చగా పసుపురాసుకొని, ఎర్రగా పెద్ద కుంకుమబొట్టు పెట్టుకొని, తల ఆరబెట్టుకుంటూ పడుకున్న ముత్తయిదువులా వుంది.

పాలూ, బియ్యం, మన్నూ... ఇంకా ఏవో కలిపి సుభద్ర నోట్లో పోశాడు ఆ కుర్రవాడు...

ఇంతలో అవతల సిద్ధంగా తయారుచేసి వుంచిన పల్లకి తెచ్చారు! బంధువుల్లో కావలిసినవాళ్ళందరూ ఆమెను మెల్లగా పట్టుకొని పడుకోపెట్టేరు- మంత్రబద్ధంగా తాడుతో కట్టివేశారు!

అప్పుడు–

ఒక్కొక్కళ్ళ నరాలూ, కండరాలూ, బిగుసుకుపోతున్నట్టయింది ఇవతల మాకు. ఆ దృశ్యం భరించరానిదయిపోయి ముఖం అవతలికి త్రిప్పుకొని వెక్కివెక్కి ఏడ్చాం. జరుగుతున్న కార్యక్రమం చూస్తూ అందులో లీనమైపోయినవారికి ఏడుపే రాలేదు!

కట్టడం పూర్తి అయేటప్పటికి దూరంగావున్న బంధువులు కూడా బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టారు. కొందరు ఆమె మీదపడి కట్టె ఎత్తనివ్వడంలేదు.

"లేవండి! లేవండి! ఎంత ఏడిస్తే మాత్రం వస్తుందా! అవతల పొద్దెక్కిపోతూంది... లెండి లెండి" అంటున్నారు.

"నారాయణ! నారాయణ!!" అంటూ శవాన్ని లేవనెత్తారు. చిన్న కొడుకూ, కూతురూ అంతవరకూ దూరంగా ఏడుస్తూన్నా — చివరి సారిగా అమ్మ కొంగుపట్టుకు వ్రేలాడుతూ ఏడుస్తున్నారు" పాపం ఆ తల్లి— వినిపించుకోలేదు...

దగ్గరకు తీసుకోలేదు—

పోనీ— చికాకుపడి కొట్టనూలేదు—

దూరంగా కసిరి, పొమ్మనలేదు—

హాయిగా పడుకుని సవారీమీద వెళ్ళిపోతూంది.

అతడిని అన్యాయంచేసి వెళ్ళిపోయింది! పసిపిల్లలని ఏం చేయమని వెళ్ళిపోతున్నదో?

—ఆమెకేం హాయిగా వసుపు కుంకుమలతో మొగుడి చేతుల్లో వెళ్ళిపోతూంది.

కొడుకా అందుకొచ్చాడు ఇంకా ఏంకావాలి?

అంత అదృష్టం అందరికీ రావొద్దూ!

అని అనుకుంటూ అందరూ కళ్ళు తుడుచుకుంటున్నారు.

సుభద్ర! ఒంటరిగా, ఎన్నడూ ఆ ఇంటి గుమ్మం దాటి ఎరగని సుభద్ర!...

ఆ వీధి దాటిపోయింది...

ఆ పేట దాటిపోయింది...

ఆ వూరు దాటి వెళ్ళిపోయింది...

మావయ్య ఒకటి రెండుసార్లు ఒక కొమ్ము పట్టుకుందామని ప్రయత్నించాడు... కాని దగ్గరవాళ్ళు అక్కరలేదని నడవమన్నారు... ఏడుపు దిగమ్రింగుతూ అలా ప్రక్కనే నడిచివెళ్ళాడు.

ఎన్నిమార్లు ఇద్దరూ కలిసి సినిమాలకూ, బజార్లకూ వెళ్ళలేదు?

యీ నాడు కూడా యిలా తను ప్రక్కని వుంటేనేగాని, ఆమె వెళ్ళలేదు. ఎంత అదృష్టవంతురాలు!

కొడుకు తల వంచుకొని కుండ పట్టుకున్నాడు. వెనక్కు తిరిగి చూడకూడదట...వాడే నయం! తల్లి ఋణం తీర్చుకుంటున్నాడు. తనెందుకు బ్రతికి వుండి? ఇన్నాళ్ళు కాపురంచేసి భార్య ఋణం ఏం తీర్చుకున్నట్టు?

ఇన్నాళ్ళూ ఆమె చేత తను సేవలు చేయించుకున్నాడు.భార్యలా, తల్లిలా, సేవకురాలిలా ఎన్నో విధాల సుభద్ర తనకు సేవచేసింది. దానికి ఎంతో ఋణపడి వున్నాడు. ఇంటికి వచ్చేసరికి ఎప్పుడూ నవ్వుతూ పలకరించేది. ఆప్యాయత, గౌరవం, భక్తి చూపేది. తనకు ఏమాత్రం ఒంట్లో బాగులేకపోయినా తనకే వచ్చినట్టు బాధపడి అహర్నిశలూ సుశ్రూష చేసేది! తన వంశం నిలిపింది. అన్నివిధాలా తన సంసారానికి ఆమె అంకితమయిపోయి. త్యాగంచేసి నిష్కల్మషంగా, నిర్మలంగా, ప్రతి ఫలాపేక్ష లేకుండా తృప్తితో వెళ్ళిపోయింది. పోనీ...తన సంతుష్టి కోసం, ఈ అంతిమ సమయంలో నయినా కాస్త ఏదయినా చేసి ఋణం తీర్చుకుందామంటే, ఈ సంఘం, ఈ ఆచారాలూ, ఏమీ చెయ్యనీయ లేదు.

శ్మశానికి ఇంకా చేరుకోకుండానే దింపారు మూడుసార్లు పలఇచ్చి మళ్ళీ బయలుదేరింది అంతిమ యాత్ర.

శ్మశానం! అందరినీ సరిసమానంగా చూసే ప్రదేశం వచ్చింది. అప్పటికప్పుడే కర్రలు అవీ సర్వం సిద్ధంగా వుండనే వున్నాయి.

అక్కడకూడా క్రింద పడుకోబెట్టి మంత్రాలు చదివారు.

కట్టెలుపేర్చి...సుభద్రను పడుకోబెట్టేరు. కొడుకు...వెనకకు తిరిగి చూడకుండా నడిచి నీళ్ళకుండని భుజంమీదనుంచి క్రిందికి పడేశాడు. ఆ కుండ పెంకులన్ని ముక్కలయినట్టే ఒక్కొక్కరి హృదయమూ ముక్కలయింది. కుండతో నీరు క్రిందపడి భూమిలోయింకి పోయినట్టే కన్నీటి ప్రవాహం క్రిందపడి ఇంకి పోయింది.

అన్నాళ్ళు పెనవేసుకుని. ముడిపడ్డ మంగళసూత్రాలనూ, నల్లపూసలనూ మాడవయ్య...అ కట్టిన చేత్తోనే త్రెంపేశాడు.

ఒక బంగారు పిసరు నోట్లో వేశారు.

గుండెలమీద మంచిగంధపు చెక్క పెట్టి మంత్రోచ్చారణచేస్తూ నేతితో తడిపి...వెలిగించారు హృదయాంతరాళంలోని జ్యోతి,హృదయం మీదకు వచ్చి వెలుగుతున్నట్టు వుంది. కుండలోనుండి అగ్ని తీసి పిడకలో తలక్రింద వుంచారు.

పిడకమీద నిప్పుపెట్టి ఎంత విసిరినా అంటని అగ్ని దేముడువిసర నవసరం లేకుండానే, చేతులు జాచి ఆక్రమించుకున్నాడు సుభద్రని.

శరీరం మీదనుండి వస్త్రం తీసి పారేశారు.

ఒక్కసారి మా ఒళ్ళు జలదరించింది. అదేమిటో అవమానం అని పించింది. కాని—అదే...అదే...శ్మశాన వైరాగ్యం...ఏదో సందేశం—పుట్టినప్పుడు లేని అడంబరం...మధ్య వస్తుంది. మళ్ళీ అనంత వాయువుల్లో కలిసి పోయేటప్పుడు...సహజంగా...వెళ్ళిపోతుంది ఈ శరీరం. అంతే ఈ జన్మ...అంతే ఎంత గడించినా,బ్రతికినంత కాలం ఎంతనాది, నాది అని అనుకున్నా...సంసార బంధంలో, ప్రపంచంతో ఎంత విడి వడని సంబంధంవున్నా...కడకి ప్రాణంతో సమానమయిన వారిని, ఆఖరికి ప్రాణాన్ని కూడా వదిలి పోవలసిందే కదా? ఏమీ తమతో తీసుకు వెళ్ళిపోము అన్న నగ్న సత్యాన్ని అక్కడ బ్రతికివున్న జీవాలకు తెలియ జెప్పడానికే అన్నట్టు అనిపించింది.

అంతసేపూ అక్కడ పంచలో తంతు సాగుతూనేవుంది. ఇద్దరు కొడుకులకీ కేశఖండనం చేశారు.

కాని మా వయ్యకు మాత్రం, ఏమీ చేయలేదు. అతను అతని లాగానే వున్నాడు. అతను చేసింది...ఏమీలేదు. అతనికి చేసినదీ ఏమీ లేదు. అంతా కొడుకులతోనే.

అదే ఆశ్చర్యం! అతను నిమిత్త మాత్రుడు. తామరాకు మీద నీటి బొట్టు. అతనికీ వింత అర్థం కాలేదు. మంత్రాల్లోను, మతంలోనూ ఏముందో మరి!

నాలుగు గంటలసేపు అక్కడ వున్నాం. సుభద్ర రూపం మరి చూద్దామన్నా లేదు! కాలి బూడిదయింది.

ఇంటికి వచ్చేసరికి అయిదున్నర, ఆరు అయింది. అప్పటికప్పుడే ఇంట్లో భోజన సన్నాహాలు అవుతున్నాయి. అందరికీ పెద్ద సంతర్పణ విస్తర్లు వేశారు—

మేము వెళ్ళగానే "ఏదో ఇంతనోట్లో వేసుకోండి. ఏం చేస్తాం!" అని విచారంతోనే సర్దుకుంటున్నారు.

సరి, సుభద్రని మరచిపోతున్నారన్నమాట...నిముష నిముషానికీ అందరూ అక్కర్లేదుదంటూనే కావలసింది తినేసి లేచారు. కొందరు ఆ సమీపంలోనే ఆయాసంతోనూ, అలసటతోనూ ఎక్కడ బడితే అక్కడ కొంగులు పరుచుకు పడుకోవడం మొదలెట్టారు. సుభద్ర కోసం ఏ ఒక్కపనీ మానుకోవడం లేదు. అప్పుడప్పుడు మాత్రం ఆమెని తలచుకుంటూ, పొగుడుతూ కంటి నీరు పెట్టుకుంటున్నారు. ఎవరయినా పరామర్శకు వస్తే గొల్లుమంటున్నారు.

ఆ వచ్చిన వారిలో మా కామాక్షమ్మ పిన్నికూడ వున్నది. ఆమెని చూసి మా మావయ్య నిర్ఘాంతపోయాడు ఏమనుకున్నాడో ఏమో!— ఆమెను చూస్తే నాకు ఇంతవరకూ వచ్చిన దుఃఖం కన్నా ఎక్కువగా పొర్లి వచ్చింది. ఎందుకంటే—

ఆకు ముల్లుమీద పడినా, ముల్లు ఆకుమీదపడినా నష్టపోయేది ఆకు మాత్రమే, ముల్లు మాత్రం చెక్కు చెదరదు.

రెండేళ్ళ క్రితం ఆమె మహాలక్ష్మిలా వుండేది. కలకలలాడుతూ, నవ్వుతూ వుండేది. ఇంకా ముప్పయి ఏళ్ళయినా నిండలేదు. అప్పుడే ఆమె జీవితంలో సుఖసంతోషాలు కరువయినాయి. "మూడు పూవులూ, ఆరు కాయలుగా వుండవలసిన కాలం" అడవి కాచిన వెన్నెల అయింది.

ఆకుపచ్చని చీర కట్టుకుని, చేతినిండా గాజులు గలగల్లాడుతూ వయసుతో వచ్చిన అందం శరీర మంతా ప్రకాశిస్తూవుండేఏఅప్సరలాగో వుండేది.

ఇప్పుడో?

ఒట్టి బోసిచేతులూ, కాళ్ళూ, మెడా, ముక్కూ మొహం అంతా రాల్చివేసిన చెట్టులా వుంది. ముఖాన పసుపులేదు. నుదుట కుంకుమలేదు. ఆ కళ అంతా ఏమయింది? చక్కని చిక్కని జుత్తు నల్లత్రాచులాటి జడ ఏమీలేదు. అంతా తీసి వేశారు. అంత అందకత్తెనూ "ఆడదేనా?" అనిపించేట్టు చేసి వదిలేరు.

భర్తతోపాటే ఆమె సర్వస్వం లాగిపారేసేరు. భర్తపోయిన తర్వాత ఆ అందచందం, అన్నీ వుండునో, వుండకపోనోగాని,— అందరూ కలిసి బలవంతాన్ని ఆమెని అనాకారిగా చేసి వదిలేసేరు, ఆమె యిష్టాయిష్టాలతో...ప్రమేయం పెట్టుకోలేదు.

మొగుడు పోయినదానికి ఇంకా ఈ హంగులూ, షోకులూ ఎందుకూ? అన్నీ తీసి పారేసి జీవితాంతం ఇలాగే ఆ చనిపోయిన మొగ వాడికి స్మృతి చిహ్నంగా వుండిపొమ్మన్నారు.

కాని—

భార్యాపోయిన పురుషునికి ఏం చేశారు? భార్యా భర్తలు సంసారంలో ఇద్దరూ సమవర్తులు కాదా? భార్యపోతే భర్తకు ఏమీ అంటదు.... అయన ఒక ప్రేక్షకుడు. ఆఖరుకు మాసినగడ్డం కూడ తీయలేదు. మరి స్త్రీని?

భర్త చనిపోతే చాలు యింత చిత్రహింసలు పాలు చేస్తారెందుకో?

ఎంతమంది పిల్లలున్నా మగవాడికి ఎంత వయసు వచ్చినా, మరో భార్యని తెచ్చుకోవచ్చు. కాని స్త్రీ అలాకాదు! భర్తపోగానే అందాన్ని నాశనం చేసుకోవాలి. కోర్కెలని చంపుకొని జీవచ్ఛవంలా వుండి పోవాలి. స్త్రీ పోయినా పసుపు రాస్తారు, కుంకుమ పెడతారు. అలంకరిస్తారు. ఇంకా ఎన్నో చేస్తారు. ఒక్క ఆడదానికే ఎందుకో యివన్నీ. మగవాడికక్కూడా ఏమయినా నిషేధాలూ అవీ వున్నాయా? వున్నా,

అతడు వాటిని అతిక్రమించినపుడు ఎందుకు ఆక్షేపించరు? ఎందుకంతలా పట్టించుకోరు?

ఒకనాటి ఆచారాలు ఈనాటికి 'ఘోరాలు' అన్యాయాలు. అన్నిట్లోనూ మార్పు వస్తుంది. అట్లాగే మారిపోయిన ఈ రోజుల్లో యిలాటి వాటిల్లోకూడా ఎందుకు మార్పు రాలేదు...ఏ మార్పయినా సహజంగా రావాలిగాని బలవంతాన రాకూడదు.

ఆకారంలో తప్పించి. భార్యపోయిన మావయ్యాకూ, భర్తపోయిన కామాక్షమ్మకూ భేదం ఎంత ఆలోచించినా నైతికంగా, అంతరంగికంగా, స్వభావికంగా కనబడలేదు. అయినా మార్పులేని ఈ సంఘం, సాంప్రదాయాలూ, ఏమీ అర్థం కాకుండానే వుండిపోయినాయి.

ఈ ఆలోచనలతో మనసు పాడయి అసంతృప్తి మాత్రం మిగిలిపోయింది.

మావయ్య 'మళ్ళీ పెళ్ళికి వెళ్ళడం అంటే' మనసు ఒప్పుకోలేదు సరికదా—అప్రయత్నంగా చేతిలోని శుభలేఖ ముక్కా ముక్కాలయింది.

ప్రతిభ సచిత్ర వారపత్రిక 7-6-68